క్లుప్తంగా

స్పీడ్ లేజర్ గన్‌తో స్పెషల్ డ్రైవ్



సంగం: మండలంలోని పెరమన క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జాతీయ రహదారిపై స్పీడ్ లేజర్ గన్‌తో ఆత్మకూరు డీఎస్పీ ఎన్.కోటారెడ్డి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్‌తో వస్తున్న వాహనాలను స్పీడ్ లేజర్ గన్ ద్వారా గుర్తించి చలానాలు విధించారు. ఆయన వెంట ఎస్సై నాగార్జునరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పొదలకూరు : పట్టణ సమీపంలో సంగం–పొదలకూరు రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు..రత్నగిరికి చెందిన జీ శ్రీనివాసులు మోటార్‌సైకిల్‌పై పొదలకూరుకు వచ్చి తిరి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో రైస్‌మిల్లు సమీపంలో అదుపుతప్పి ముందు వెళ్తున్న వృద్ధుడి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. వృద్ధుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. శ్రీనివాసులును 108 సిబ్బంది నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

చిన్నారులకు బాండ్ల అందజేత




కోవూరు: పడుగుపాడులోని చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీలో వలంటీర్‌గా పనిచేస్తూ మృతి చెందిన కొమరగిరి అఖిల కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు చెక్కు మంజూరైన విషయం తెలిసిందే. ఈ నిధులను పడుగుపాడు సొసైటీలో అఖిల కుమారులు భవేష్, ధన్వేష్ పేర్లపై డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్లను వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సూచనల మేరకు చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారి పేర్లపై నగదును డిపాజిట్ చేసి బాండ్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పీ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎన్ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహమ్మద్, చిరంజీవి, ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



మనుబోలు: మండలంలోని పలు పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు అధికారులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈఓపీఆర్డీ పుట్టా రమణయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ మరో మూడ్రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్నుల వసూళ్లను వేగవంతం చేసినట్లు తెలిపారు. పన్ను వసూళ్లలో జిల్లాలో మనుబోలు మండలం ఆరో స్థానంలో వుందని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 86 శాతం మేర పన్నులు వసూలు చేశామని వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణయ్య, చెంచుప్రసాద్, బిల్ కలెక్టర్ శ్రీహరి ఉన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



పొదలకూరు : ఎస్సీ వర్గీకరణ బిల్లును బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు మందా పెంచలయ్యమాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని నావూరు, నావూరుపల్లి, అమ్మవారిపాళెంలో గ్రామాల్లో రెండో విడత మాదిగల మహాసంగ్రామ పాదయాత్రను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల క్రితం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికి ప్రవేశపెట్టకుండా హామీని విస్మరించిందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం ఈ నెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎవరో పార్టీని వీడినంత మాత్రాన ఏమీ కాదు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ఏదో ముగ్గురు నేతలు టీడీపీలోకి వెళ్లినంత మాత్రాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ అంటూ కొందరు మాట్లాడుతున్నారని.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాభిమానం ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 44వ డివిజన్లోని శిఖరంవారి వీధి, పెద్దబజార్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ రంగు మారడంతో సదరు నేతలు జిల్లాలో పదింటికి అన్ని సీట్లను తీసుకొస్తామంటున్నారని, ముందు వారు గెలిచే అంశాన్ని చూసుకోవాలని విమర్శించారు. వీరు టీడీపీలోకి వెళ్లడంతో ముందు నుంచి ఆ పార్టీలో ఉన్న నేతలు, కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారని చెప్పారు. ఎవరి కారణంతో గెలిచామో మర్చిపోయి సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సీఎంను మోసం చేసిన వారికి రానున్న ఎన్నికల్లో భగవంతుడు తగిన బుద్ధి చెప్తారన్నారు. తనను శాసనసభకు రానివ్వమంటూ కొందరు శపథాలు చేయడం హాస్యాస్పదమన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్న బొమ్మతోనే గెలిచి.. తిరిగి శాసనసభలో అడుగుపెడతానన్నారు.

పన్నులను చెల్లించాలి

నగర ప్రజలు తమ ఆస్తి పన్నులను ఈ నెల 31లోపు చెల్లించాలని కోరారు. నెలాఖరు వరకు వడ్డీ మాఫీ వర్తించనుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ఇబ్బందుల్లేకుండా చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలు నివసించే ప్రాంతాలు, మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో గల నజీర్‌తోట వద్ద ఈద్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మసీదుల వద్ద పరిశుభ్రత ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈద్గా ప్రాంగణంలో సిమెంట్ ఫ్లోరింగ్ అవసరమని ముస్లింలు కోరగా, వీటిని వేయించామని తెలిపారు. మరో రెండు పనులనూ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. నగరంలోని పలు మసీదుల వద్ద పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఇంకేమైనా సౌకర్యాలు అవసరమో తెలుసుకొని వాటిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి అనంత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి 42వ వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ఏప్రిల్ 8 వరకు నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గుప్తా, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండప కమిటీ కార్యదర్శి మోహన్‌రావు పేర్కొన్నారు. ఆహ్వాన పత్రికలను సోమవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పుత్రకామేష్టి యాగాన్ని బుధవారం ఉదయం ఆరుకు నిర్వహించనున్నామని, పాల్గొనాలనుకునే దంపతులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. శ్రీరామనవమి పర్వదినాన్ని వేడుకగా గురువారం నిర్వహించనున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కమిటీల గౌరవాధ్యక్షుడు కిషోర్‌కుమార్, నిర్వాహకులు వెంకటరత్నం, మస్తాన్‌రావు, సత్యం, పూర్ణచంద్రరావు, కుమార్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో..



సుంకు చెంగన్న పాఠశాలలో..

నెల్లూరు (అర్బన్): జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్‌బాబు, శరత్‌కుమార్, వంశీరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు హజరత్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతుల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని లక్ష్మీ విఘ్నేశ్వర చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్‌పోర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ శ్రీమన్నారాయణ, పినాకినీ లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ సునీల్, ప్రధానోపాధ్యాయుడు అరవింద్, రాధాకృష్ణ, బాలకృష్ణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



ఆనం అరుణమ్మకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(పొగతోట): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు ఆమె కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోవిడ్ – 19 సమయంలో.. జెడ్పీలో పనిచేస్తూ గతంలో మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాన్ని కల్పించాలని కోరారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాలలో అడ్మిషన్లపై విచారణ జరపరూ..



నెల్లూరు (అర్బన్): నగరంలోని వీఆర్ లా కళాశాలలో ఇటీవల నిర్వహించిన మేనేజ్‌మెంట్ అడ్మిషన్ల ప్రక్రియపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ఏబీవీపీ నేతలు కోరారు. ఈ మేరకు జేసీ కూర్మనాథ్‌కు కలెక్టరేట్లో వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం సంఘ నగర కార్యదర్శి యశ్వంత్ మాట్లాడారు. మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్లు పొందిన చెన్నైకి చెందిన కొందరు వారి ఆధార్ కార్డులను మార్ఫింగ్ చేసి ఆంధ్రప్రదేశ్ అడ్రస్ పెట్టి అర్హత సాధించారనే ఆరోపణల నేపథ్యంలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. నేతలు సాయియాదవ్, నర్సింహులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్ట్



నెల్లూరు (అర్బన్): కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్ సోమవారం నిర్వహించారు. రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు రకరకాల వంటకాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, విద్యా వలంటీర్లు వినీత, రాశీ, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 41 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 13, స్పందనకు 28 అర్జీలు అందాయి. వీటిని స్వీకరించిన అనంతరం కమిషనర్ హరిత మాట్లాడారు. స్పందనకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. తమ విభాగానికి వచ్చిన ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఎస్‌ఈ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


శ్యామలకు డాక్టరేట్

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు శ్యామలగౌరికి డాక్టరేట్‌ను ఎస్వీ వర్సిటీ ప్రదానం చేసింది. జాబ్ శాటిస్ఫాక్షన్ అమాంగ్ ది ఎంప్లాయీస్ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకింగ్ ఆర్గనైజేషన్స్ ఇన్ ఎస్పీఎస్సార్ నెల్లూరు డిస్ట్రిక్ట్ అనే అంశంపై విశ్రాంత ప్రొఫెసర్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో కామర్స్ విభాగంలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆమెను పలువురు అభినందించారు.

వైద్యుల నిరసన

నెల్లూరు (అర్బన్): రాజస్థాన్‌లో వైద్యులపై ఆ రాష్ట్ర పోలీసులు అమానుషంగా దాడి చేసి లాఠీచార్జి చేయడంపై బ్లాక్ డేను ఐఎంఏ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పలు ఆస్పత్రుల్లో నిరసనలు పాటించారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర నేత అశోక్, నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, వెంకటరూపేష్ మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ వైద్యసేవలను అందరికీ అందించాలని రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. అయితే ఎమర్జెన్సీ వైద్యానికయ్యే ఖర్చును ప్రైవేట్ డాక్టర్లు పెట్టుకోవడం సాధ్యం కాదన్నారు. దీనిపై ప్రజాస్వామికంగా నిరసన తెలియచేస్తున్న డాక్టర్లపై పోలీసులు అమానుషంగా దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

మోహినీ అలంకారంలో శ్రీరాముడు



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరాముల వారి కొళాయి మహోత్సవాల్లో భాగంగా స్వామివారు మోహినీ అలంకారంలో సోమవారం దర్శనమిచ్చారు. ఈఓ హేమచంద్రరావు, రమేష్, సురేష్, బాలాజీ, బలరామ్, తదితరులు పర్యవేక్షించారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



పొట్టేపాళెంలో..

నెల్లూరు రూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేనాసుజన్ పేర్కొన్నారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలతో సంభవించే అనర్థాలను వివరించారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు.

• పొట్టేపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని అంబాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సుకన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌష్టికాహార విలువలను తెలియజేశారు.

పెద్దాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ చక్రధర్‌బాబుకు కలెక్టరేట్లో వినతిపత్రాన్ని పార్టీ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కలెక్టర్ స్పందించి ప్రత్యేకంగా నిధులను కేటాయించి పరికరాలను కొనుగోలు చేయడంతో పాటు లిఫ్టలను బాగు చేయించాలని కోరారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కృష్ణయ్య, నేతలు కుమార్, ప్రసాద్, శ్రీనివాసులు, సుధీర్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



మాట్లాడుతున్న చిరంజీవి

నెల్లూరు రూరల్: బుజబుజనెల్లూరులోని జెడ్పీ హైస్కూల్లో సరస్వతీ పూజను పదో తరగతి విద్యార్థులు సోమవారం నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంక్షించారు. అనంతరం విద్యాసామగ్రిని అందజేశారు. డాక్టర్ చిరంజీవి, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, ప్రధానోపాధ్యాయులు జాకీరాఖానుమ్, ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ రంగస్థల నటుడు వెంకటసుబ్బారావును శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. భక్తవత్సలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మోహన్‌రాజు, రాజేష్‌రాజు, రమేష్‌రాజు, రఘు, నవీన్, తదితరులు పాల్గొన్నారు

ముత్తుకూరు జెడ్పీటీసీకి పరామర్శ



నెల్లూరు (పొగతోట): ముత్తుకూరు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య సతీమణి వెంకటరమణమ్మ మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరామర్శించారు. వారి నివాసానికి సోమవారం వెళ్లి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వేమిరెడ్డి దంపతులకు కృతజ్ఞతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తమకు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు బధిరుల సంఘ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, తదితరులు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మేరకు సోమవారం వారు సమావేశమయ్యారు. ఏసీ స్టేడియంలో నిర్వహించిన బధిరుల పోటీల్లో భోజన సదుపాయం, ప్రత్యేక బహుమతులకు వేమిరెడ్డి దంపతులు ఆర్థిక సాయం చేశారని చెప్పారు. బధిరుల సంఘ వైస్ ప్రెసిడెంట్ సాహితి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో గల హౌసింగ్‌బోర్డుకాలనీ, ఇందిరాగాంధీనగర్, సంజయ్‌గాంధీనగర్ ఫీడర్లలో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా మంగళవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డుకాలనీ, ఇందిరాగాంధీనగర్, సంజయ్‌గాంధీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

క్రైమ్ కార్నర్

సర్వేపల్లి కాలువలో మృతదేహం లభ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఆర్పీ డొంక సమీపంలో గల సర్వేపల్లి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. పోలీసుల సమాచారం మేరకు.. సర్వేపల్లి కాలువలో ఓ మృతదేహం లభ్యమైందని పోలీసులకు వీఆర్వో పద్మ తెలియజేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూషించారంటూ మహిళ ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తనను దూషించారంటూ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వివరాలు.. నవాబుపేటలోని చాకలివీధిలో వరలక్ష్మి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆస్తి విషయమై తడికలబజార్ సెంటర్‌కు చెందిన చెర్రీతో పాటు అతని కుటుంబసభ్యులు సురేఖ, కృష్ణయ్య, సాయి తనను నానా దుర్భాషలాడారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న బైక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదుపు తప్పిన బైక్ కారును ఢీకొన్న ఘటన నగరంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటకు చెందిన చైతన్య బైక్‌పై కావలికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో గాయపడిన చైతన్యను ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.